మాట్లాడుతున్న మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్, పక్కన ఎమ్మెల్సీలు సుభాశ్‌రెడ్డి, యాదవరెడ్డి

గోనె సంచుల కుంభకోణంలో నిజాలు తేల్చాలి

- విజిలెన్స్ శాఖతో విచారణ జరిపించాలి
- బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలి
- ఎమ్మెల్సీ శేరిసుభాశ్‌రెడ్డి
- పీహెచ్‌సీల్లో వైద్యులు, స్టాఫ్‌ను నియమించాలి
- మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాగౌడ్
- కలెక్టరేట్ ఆడిటోరియంలో జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 23: జిల్లా కేంద్రంలో ఎంఎల్ఎస్ పాయింట్‌లో చోటు చేసుకున్న గోనె సంచుల కుంభకోణంలో అధికారులు నిజాలు తేల్చి ఎవరి ప్రమేయం ఉన్నా వదలొద్దని, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావును ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి ఆదేశించారు. మెదక్ జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం కలెక్టరేట్‌లో జడ్పీ చైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్సీలు శేరి సుభాశ్‌రెడ్డి, యాదవరెడ్డితోపాటు అదనపు కలెక్టర్ రమేశ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో గోనె సంచుల కుంభకోణం, పీడీఎస్ బియ్యం పక్కదారి పట్టిందని పత్రికల్లో వచ్చిన కథనాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, డీఎంవో హరికృష్ణను ప్రశ్నించారు. సుమారు రూ.7 కోట్ల విలువ చేసే బియ్యం, గోనె సంచులు పక్కదారి పట్టాయని వారు సభాముఖంగా తెలిపారు. ఈ వ్యవహారంపై విచారణ జరుగుతుందని, మూడేండ్లుగా ఇలా జరుగుతున్నట్లు తెలుస్తుందని, ఇక్కడ విధులు నిర్వహించిన అధికారులపై విచారణ చేపట్టాలని పౌరసరఫరాల కమిషనర్‌కు నివేదికలు పంపించినట్లు తెలిపారు. అవినీతికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టి, మొత్తాన్ని రికవరీ చేయాలని అధికారులకు ఎమ్మెల్సీ సూచించారు. విద్యుత్ సమస్యలపై జడ్పీటీసీలు కృష్ణారెడ్డి, బాబ్యానాయక్, కొల్చారం, టేక్మాల్, నార్సింగి ఎంపీపీలు ట్రాన్స్‌కో ఎస్ఈ జానకీరామ్ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి జోక్యం చేసుకొని సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈకి సూచించారు.

'మన ఊరు-మనబడి' బిల్లులు చెల్లించాలి

'మనఊరు-మనబడి' కార్యక్రమం ద్వారా పాఠశాల్లో చేపట్టిన పనులకు బిల్లులు త్వరగా చెల్లించాలని పాపన్నపేట ఎంపీపీ చందనాప్రశాంత్‌రెడ్డి డీఈవో దృష్టికి తీసుకువచ్చారు. మల్లంపేట పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, ఇక్కడి వారిని డిప్యూటేషన్‌పై పంపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నిజాంపేటలోని హైస్కూల్‌కు నిధులు మంజూరైన అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదని తొందరగా పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ విజయ్‌కుమార్ డీఈవోను రాధాకిషన్‌ను డిమాండ్ చేశారు.

పాత పద్ధతిలోనే 'రైతుబంధు' అమలు చేయాలి

పాత పద్ధతి ద్వారానే రైతుబంధు పథకం అమలు చేయాలని మెదక్ జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాత పద్ధతి ద్వారానే రైతుబంధు పథకం అమలు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయధికారి గోవింద్ తెలిపారు. కేజ్‌వీల్ ట్రాక్టర్లు రోడ్లపై తిరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా రవాణాధికారులను ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి ఆదేశించారు. జిల్లాలో వివిధ నిధుల ద్వారా జరుగుతున్న పనుల పురోగతి వివరాల నివేదికలు ప్రజాప్రతినిధులు అందజేయాలని ఆయా శాఖల ఎస్ఈలకు ఎమ్మెల్సీ సూచించారు. సబ్సిడీ డబ్బులు చెల్లించిన గొర్రెల పంపిణీ చేపట్టాలని వెటర్నరీ అధికారులకు ఎమ్మెల్సీ సూచించారు.

పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదం..

కేసీఆర్ ప్రభుత్వం జిల్లా అభివృద్ధికి కేటాయించిన నిధులతో చేపట్టిన పనులు జరిగేలా ప్రతిపాదించిన తీర్మానాన్ని జడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి ప్రవేశ పెట్టారు. దీనిని వెల్దుర్తి జడ్పీటీసీ రమేశ్‌గౌడ్ బలపర్చగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. నిజాంపేట జడ్పీటీసీ సభ్యుడు విజయ్‌కుమార్ మెదక్ జిల్లాను సిరిసిల్ల జోన్ నుంచి చార్మినార్ జోన్‌లో కలపాలని తీర్మానం ప్రవేశపెట్టగా, రేగోడ్ జడ్పీటీసీ యాదగిరి బలపర్చగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎన్ఎస్ఎఫ్ ఫ్యాక్టరీని పునః ప్రారంభించాలని, వికలాంగులకు ఉచిత బస్ పాస్ సౌకర్యం కల్పించాలని, ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పించేలా ప్రభు త్వం చర్యలు తీసుకోవాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. సమావేశంలో జడ్పీ సీఈవో శైలేశ్ వెంకట్, ఆయా శాఖాల జిల్లా అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వైద్యులను నియమించాలి..

– జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖగౌడ్

మెదక్ జిల్లాలోని ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రాల్లో వైద్యులను నియమించాలని గౌరవ సభ్యులు సమావేశం దష్టికి తీసుకురాగా జడ్పీ చైర్‌పర్సన్ జోక్యం చేసుకొని ప్రతి పీహెచ్‌సీలో వైద్యులతో పాటు స్టాఫ్ నర్సులను నియమించాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. జనవికాస్ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులకు ఆహ్వానించకపోవండపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భగా ఆయా శాఖల అధికారులు తమ తమ నివేదికలను చదివి వినిపించారు.

జడ్పీ సమావేశానికి హాజరైన సభ్యులు, ఆయా శాఖాల జిల్లా అధికారులు

దుబ్బాక అభివృద్ధే నా లక్ష్యం

- నా గెలుపునకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి
- సోషల్ మీడియాలో కించపర్చేవిధంగా పోస్టులు పెడితే సహించబోం
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, డిసెంబర్ 23: 'బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆశీస్సులతోపాటు దుబ్బాక ప్రజల అభిమానంతో భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచాను. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ రుణ పడి ఉంటాను.' అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా దుబ్బాకలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి మాట్లాతూ తన విజయం కోసం కృషి చేసిన పార్టీ శ్రేణులతోపాటు యువత, మహిళలు అన్నివర్గాల వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తాను దవాఖానలో చికిత్స పొందుతున్న సమయంలో పార్టీ శ్రేణులు, అభిమానులు ఓ సైనికులుగా ప్రచారంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ రుణ పడి ఉంటానని తెలిపారు. దుబ్బాక అభివృద్ధిలో అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. నియోజకవర్గంతో పాటు దుబ్బాక మున్సిపాలిటీ కావడంతో అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రస్తుతం దుబ్బాకలో పూర్తిస్థాయిలో అధికారులు లేకపోవడంతో అభివృద్ధికి అడ్డంకిగా మారిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దుబ్బాకను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. దుబ్బాక పట్టణంలో రింగ్ రోడ్డుతోపాటు దుబ్బాక–హబ్షీపూర్ రోడ్డు విస్తరణ పనులు చేపడుతామన్నారు. దుబ్బాక మల్లన్నసాగర్ నుంచి జరుగాల్సిన కాల్వల నిర్మాణం పనులు త్వరలో పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలకు మౌలిక వసతులు, వసతి గృహాలు, విద్య, తాగునీరు ప్రతి శాఖలతో అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహిస్తామన్నారు. దుబ్బాకలో ఆడిటోరియం, వెజ్అండ్‌నాన్‌వెజ్ మార్కెట్ భవనం, కూడవెల్లి వాగులో పలుచోట్ల చెక్‌డ్యాంల నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ఇదిలా ఉండగా, సోషల్ మీడియాలో కొందరు అత్యుత్సాహంతో గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని, దానిని మానుకోవాలని సూచించారు. చిల్లర పోస్టులు పెట్టి దిగజారుడు రాజకీయాలు చేయొద్దన్నారు. కించపర్చే విధంగా పోస్టులు పెడితే సహించబోమని హెచ్చరించారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని, త్వరలోనే దుబ్బాకలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పునఃప్రారంభించి, ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రొట్టే రాజమౌళి, గన్నే భూంరెడ్డి, ఎల్లారెడ్డి, కొత్త కిషన్‌రెడ్డి, రామస్వామిగౌడ్, తదితరులున్నారు.

దుబ్బాకలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక బాలాజీ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు కొత్త ప్రభాకర్‌రెడ్డి, మంజులత

దుబ్బాక బాలాజీ ఆలయంలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి దంపతుల పూజలు

దుబ్బాక, డిసెంబర్ 23: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం దుబ్బాక బాలాజీ దేవాలయానికి భక్తులు పోటెత్తారు. స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మంజులత దంపతులు ఉత్తర ద్వారం నుంచి స్వామి వారి దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి సన్నిధిలో తులాభారం నిర్వహించారు. ఆలయంలోని గోశాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్‌రెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ దేవాలయంలో గోశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

కేసీఆర్ పథకాలు కొనసాగించాలి

మిరుదొడ్డి, డిసెంబర్ 23: బడుగు బలహీన వర్గాల ప్రజలను ఆర్థికంగా ఆదుకోవాలనే లక్ష్యంతో కేసీఆర్ సర్కార్ అమలుచేసిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మిరుదొడ్డి టౌన్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, వానకాలంలో వర్షాలకు కూలిన ఇండ్ల బాధితులకు పరిహారం చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఇస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ అమలు చేసిన పథకాలతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఆరు గ్యారెంటీలు అమలు చేయాలన్నారు. కాగా, మిరుదొడ్డిటౌన్‌లోని మహంకాళి దేవి అమ్మవారి ఆలయ 8వ వార్షికోత్సవం ఈ నెల 25న నిర్వహిస్తుండగా, కార్యక్రమాలకు హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ చైర్మన్‌ల్ముల స్వామి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని ఖాజీపూర్ మహంకాళి అమ్మవారి ఆలయ 5వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎంపీపీ గజ్జల సాయిలు, జడ్పీటీసీ సూకురి లక్ష్మీలింగం, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, పీఏసీఎస్ చైర్మన్ రాజలింగారెడ్డి, వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, సర్పంచ్‌లు శ్రీనివాస్, రాములు, శంకర్, కవితా రాజు, ఎంపీటీసీలు నర్సింహులు, మాజీ ఎంపీపీ పంజాల కవితా శ్రీనివాస్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్లు సత్యానారాయణ, బాపురెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డిలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆటో డ్రైవర్లకు.. ఉపాధి కల్పించాలి

మెదక్, దుబ్బాకలో ఆటో డ్రైవర్ల నిరసన ర్యాలీ

మెదక్ అర్బన్/ దుబ్బాక టౌన్, డిసెంబర్ 23: ఆటో డ్రైవర్లకు ఉపాధి కల్పించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మెదక్, దుబ్బాకలో ఆటో యూనియన్ల ఆధ్వర్యంలో శనివారం నిరసన ర్యాలీలు నిర్వహించారు. మెదక్ జిల్లా కేంద్రంలో మెదక్ డివిజన్ మినీడోర్, బజాజ్ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆరెళ్ల జనార్దన్ గౌడ్ ఆధ్వర్యంలో మెదక్ వెల్‌కమ్ బోర్డ్ నుంచి ఆటోనగర్, పాతబస్టాండ్, రాందాస్‌చౌరస్తా, న్యూబస్టాండ్ మీదుగా వేలాది ఆటోలతో కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, డీఆర్వోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనార్దన్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకంతో ఆటో డ్రైవర్లకు నష్టం జరుగుతున్నదన్నారు. తమ కుటుంబాలను పోషించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆటో కార్మికుల జీవనోపాధికి నష్టం కలుగకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దుబ్బాకలో బస్టాండ్ ఎదుట ఆటో డ్రైవర్లు బైఠాయించి ఆందోళన చేప్టారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు మండల నర్సింలు, ఉపాధ్యక్షుడు చందు, గంభీర్‌పూర్ ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎండీ.షాదుల్, లచ్చపేట వార్డు అధ్యక్షుడు బిల్ల రవికుమార్, ప్రవీణ్, దుంపలపల్లి వార్డు ఆటో యూనియన్ అధ్యక్షుడు కోనేటి సత్తయ్య, చేర్వాపూర్ వార్డు బాధ్యులు రాజెల్లు, సుమన్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో టాటాఏస్ అధ్యక్షుడు నజీర్, నందు, ప్రవీణ్, భూంపల్లి మండల బాధ్యులు స్వామి, శ్రీనివాస్‌గౌడ్, సతీశ్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, చెల్లాపూర్ వార్డు ఆటో యూనియన్ బాధ్యులు యాదవరెడ్డి, విష్ణు, మధుగౌడ్, కిష్టయ్య, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో ఆటో డ్రైవర్ల నిరసన ర్యాలీ

దుబ్బాకటౌన్: దుబ్బాకలో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

మెదక్ నిరసన ర్యాలీలో ఆటోలు

'దత్తగిరి' ముస్తాబు

- నేటి నుంచి దత్త యజ్ఞం, 21 గుండాలతో చండీ హోమాలు
- 26న దత్త జయంతి, 21,600 దీపాలతో ఆరాధన
- ఉత్సవాలకు కాశీ జగద్గురు రాక

విద్యుత్ దీపాలతో కళకళలాడుతున్న బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమం

బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమం ఆవరణలో ఏర్పాటు చేసిన యజ్ఞ గుండాలు

ఝరాసంగం, డిసెంబర్ 23: ఝరాసంగం మండలంలోని ప్రకృతి రమణీయత ప్రశాంతతకు నిలయమైన బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో మార్గశిర పౌర్ణమి 26న దత్త జయంతిని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతి 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరిమహారాజ్, డాక్టర్ సిద్దేశ్వర స్వామి ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి మూడు రోజుల పాటు 21 యజ్ఞ గుండాలతో దత్త యజ్ఞాలు, లోక కల్యాణార్థం, చండీ హోమం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ పీఠధిపతులు పేర్కొన్నారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు తెలుగు రాష్ర్టాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ర్టాల నుంచి కూడా భక్తులు తరలిరానున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆశ్రమ ఆవరణలో చలువ పందిళ్లు, తాగునీరు, భోజన వసతి కల్పించేందుకు దత్తగిరి మహారాజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆశ్రమ ముఖద్వారంతోపాటు దత్తాత్రేయుడు, మహర్షి అనసూయ మాత, జ్యోతిర్లింగాలు, పంచవృక్షాలు, రేణుకా మాత, నవగ్రహాల ఆలయాలను అలంకరించారు. ఆశ్రమం ఎదుట రోడ్డుకు ఇరువైపులా దుకాణాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్సవాలకు బస్సులు, పోలీసు బందోబస్తు

దత్త జయంతికి జహీరాబాద్ నుంచి బర్దీపూర్ ఆశ్రమానికి భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా జహీరాబాద్ డీఎస్పీ రఘు, స్థానిక ఎస్ఐ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు, మండల వైద్యాధికారి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు.

భూ అక్రమాలపై చర్యలు చేపడతాం

- కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తే క్రిమినల్ కేసులు
- ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక బృందాలు
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డి

వివాదాస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి

అమీన్‌పూర్, డిసెంబర్ 23: ఐలాపూర్ భూ అక్రమాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందని, ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి అన్నారు. ఐలాపూర్‌లోని వివాదాస్పద భూముల్లో కొనసాగుతున్న ఆక్రమణలపై శనివారం ఆయన స్థానిక తహసీల్దార్ గౌరీవత్సలతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న భూ ఆక్రమణదారులు అధికారులను అడ్డుకునేందుకు ప్రయత్నం చేశారు. కోర్టు ఆదేశాలను గౌరవించాల్సిందేనని, నిబంధనలకు విరుద్ధంగా ఏ ఒక్కరూ ప్రయత్నించినా క్రిమినల్ కేసులు పెట్టాలని ఆర్డీవో స్థానిక అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఐలాపూర్ భూ ఆక్రమణలపై నిగ్గు తేలుస్తామని, ఇకపై ఒక్క గజం కబ్జాకు గురైనా చూస్తూ ఊరుకోబోమన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక కమిటీ వేసి ఏర్పాటు చేయనున్నామన్నారు. అధికారులు సైతం సమన్వయం పని చేయాలని సూచించారు. అమీన్‌పూర్‌లో విలువైన ప్రభుత్వ భూములు ఉన్నాయని, వాటిని పరిరక్షించేందుకు జిల్లా సర్వే అధికారులు వారానికి రెండు రోజులు స్థానికంగా అందుబాటులో ఉంటారని, స్థానిక అధికారులతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు సైతం ఐలాపూర్ శివారు ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని కోర్టు ఆదేశానుసారం పనిచేయాలన్నారు. వివాదాస్పద భూములు, ప్రభుత్వ భూముల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు సమాచారం అందేలా చూడాలని ఆదేశించారు. ఆయనవెంట డిప్యూటీ సర్వేయర్ బాలరాజ్, ఆర్ఐ రఘునాథ్‌రెడ్డి, స్థానిక పంచాయతీ కార్యదర్శులు సచిన్, బిందు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

బొల్లారం, డిసెంబర్ 23: నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టిన అక్రమ నిర్మాణాలను శనివారం రాత్రి హుడా అధికారులు కూల్చివేశారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బీసీ కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా హుడా భూముల్లో అక్రమ నిర్మాణాలపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు జేసీబీ సహాయంతో నిర్మాణాలను నెలమట్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

బీసీ కాలనీలో జేసీబీతో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న హుడా అధికారులు